నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 25 జూన్ 2025 | KAMAREDDY

# ఏం సాధించారని రైతు పండుగ సంబురాలు?

- రైతుల్ని నమ్మించి మోసం చేసినందుకా!
- స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రైతుభరోసా వేసి వేడుకలా !
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



మోర్తాడ్, జూన్ 24: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పండుగ సంబురాలపై మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. ఏం సాధించారని రైతు సంబురాలు చేసుకుంటున్నారని, రైతులను నిండా ముంచి నమ్మించి మోసం చేసినందుకా.. సగం మంది రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఎగ్గొట్టినందుకా అని సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. రైతును రాజు చేయాలన్న ఉద్దేశంతో పంటకు పెట్టుబడి సాయం ఇవ్వాలని, రైతుల బాధలు తీర్చాలనే రైతుబంధు పథకాన్ని కేసీఆర్ ప్రారంభించారని తెలిపారు.

కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదేండ్లలో రైతుబంధు ద్వారా నేరుగా రైతుఖాతాల్లో 11 విడుతల్లో సుమారు రూ.75వేల కోట్లు జమచేసిందని పేర్కొన్నారు. కానీ ఏనాడు కాంగ్రెస్ ప్రభుత్వం మాదిరిగా హంగామా చేయలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మొదటిసారి అధికారంలోకి వచ్చాక మొదటిసారి ఇచ్చిన హామీ ప్రకారం రైతుభరోసా ఎకరానికి రూ.7500కాకుండా రూ.5వేలు ఇచ్చి రెండో విడుత పూర్తిగా ఎగ్గొట్టి మూడో పంటకు నాలుగు ఎకరాల పైన ఉన్న రైతులందరికీ ఎగ్గొట్టినందుకు సంబురాలు చేసుకోవాలా అని ప్రశ్నించారు. అన్ని రకాల వడ్లకు బోనస్ అని చెప్పి సన్నాలకు అని మాట మార్చినందుకా, రైతు బీమా ప్రీమియం కట్టనందుకా! రైతులకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి సక్రమంగా అమలు చేయకుండా రైతు నడ్డి విరిస్తున్నందుకా సంబురాలు అని నిలదీశారు.

**సంబురాల పేరిట ఎన్నికల డ్రామాలు ఆపాలి**

నాడు కేసీఆర్ పాలనలో వ్యవసాయం పండుగ అయితే...రేవంత్‌రెడ్డి పాలనలో వ్యవసాయం దండుగ అయినందుకా ? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి పాలనలో ఐదువందల మందికిపైగా రైతులు అసువులు బాసినందుకా, పండించిన ధాన్యం సకాలంలో అమ్ముకోలేక కల్లాల వద్ద పిట్టల్లాగా రైతులు రాలిపోయినందుకా! ఎందుకు చేసుకోవాలి సంబురాలు అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయని రైతుభరోసా వేసి సంబరాలు చేస్తున్నావని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా సంబురాల పేరిట ఎన్నికల డ్రామాలు ఆపి, రైతులకిచ్చిన హామీలు నెరవేర్చాలని సూచించారు. ఎగ్గొట్టిన రైతుభరోసా వెంటనే ఇవ్వాలని, రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, అన్ని రకాల వడ్లకు పాత సీజన్‌లతో సహా రూ.500 బోనస్ డబ్బులు వెంటనే చెల్లించాలని రైతుల పక్షాన బీఆర్‌ఎస్ పార్టీ డిమాండ్ చేస్తున్నదని పేర్కొన్నారు.



ఇసుక ట్రాక్టర్ల యజమానులను నిలదీస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు

# ఉచిత ఇసుక @ రూ.2,200

- ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నుంచి వసూలు
- ట్రాక్టర్లను అడ్డుకున్న కొల్లూరు గ్రామస్తులు
- వాహన యజమానుల నిలదీత
- రూ.1600లకే అందించాలని డిమాండ్

బాన్సువాడ రూరల్, జూన్ 24 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ట్రాక్టర్ ఇసుకను రూ.16వందలకే సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. బాన్సువాడ మండలంలోని కొల్లూరు గ్రామాల్లో ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందజేయనున్నట్లు ప్రకటించింది. కానీ ఇసుక వ్యాపారులు లబ్ధిదారుల నుంచి ట్రాక్టర్‌కు 2,200 రూపాయలు వసూలు చేస్తున్నారు. లబ్ధిదారులకు రూ.16వందలకే ట్రాక్టర్ ఇసుకను సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి చించోలి, కిష్టపూర్, దామరంచ గ్రామాల ట్రాక్టర్ యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ యజమానులు ట్రాక్టర్‌కు రూ.2,200 చెల్లిస్తేనే ఇసుక సరఫరా చేస్తామని చెప్పడంతో గ్రామస్తులు ఆగ్రహానికి గురయ్యారు. దీంతో గ్రామంలో ఇసుక ట్రాక్టర్లను అడ్డుకొని, యజమానులను నిలదీశారు. ట్రాక్టర్ యజమానులకు రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారని లబ్ధిదారులు ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందిస్తున్నా, ట్రాక్టర్ యజమానులు ఇష్టానుసారంగా అధిక ధరలకు సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి సరైన ధరకు ఇసును సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



గ్రామస్తుల ఆందోళనతో నిలిచిన ఇసుక ట్రాక్టర్లు



# వణికిస్తున్న వైరల్ ఫీవర్!

- వాతావరణంలో భిన్న మార్పులు
- కురిస్తే భారీ వర్షాలు.. కాస్తే మండే ఎండలు
- జ్వరాల బారిన పిల్లలు, పెద్దలు
- కిటకిటలాడుతున్న ప్రభుత్వ దవాఖానలు
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు

**నిజామాబాద్ జిల్లాలో** కొన్నిరోజులుగా వాతావరణంలో భిన్న మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. తేమ, వేడితో కూడిన వాతావరణం మూలంగా వైరస్ వృద్ధి చెందే అవకాశం ఉన్నది. కొన్నిరోజులుగా భారీ వర్షాలు కురవడం.. మరుసటి రోజు ఎండలు దంచికొడుతుండడంతో వాతావరణంలో మార్పుల కారణంగా చిన్నా పెద్ద అనే తేడా లేకుండా రోగాల బారిన పడుతున్నారు. మరోవైపు జిల్లాలోనూ కరోనా కేసులు వెలుగుచూడడంతో భయాందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వైరల్ ఫీవర్ బాధితులతోపాటు ర్యాపిడ్ టెస్టుల కోసం వచ్చేవారితో ప్రభుత్వ దవాఖానలు కిటకిటలాడుతున్నాయి.

-ఖలీల్‌వాడి, జూన్ 24



**వాతావరణ మార్పులతో జ్వరాలు**

వాతావరణం చల్లబడడంతో వైరల్ ఫీవర్ వస్తుంది. వెంటనే డాక్టర్‌ను సంప్రదించి తగిన చికిత్స చేయించుకోవాలి. మూడు రోజుల వరకు వైరల్ ఫీవర్ ఉంటుంది. దీనికి భయపడాల్సిన అవసరం లేదు. మీ దగ్గరలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలో కూడా డాక్టర్లను సంప్రదించి మాత్రలను వాడవచ్చు. ప్రతి సెంటర్‌లో అన్ని మందులను అందుబాటులో ఉన్నాయి. కరోనాపై అప్రమత్తంగా ఉండాలి.

-రాజశ్రీ, నిజామాబాద్ డీఎంహెచ్‌వో

**కరోనా పట్ల భయపడాల్సిన అవసరం లేదు**

కరోనా పట్ల జాగ్రత్తగా ఉండాలి. చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. జ్వరం, జలుబు , దగ్గు వారం రోజులుగా ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. భయపడాల్సిన అవసరం లేదు. మందులు వాడతే సరిపోతుంది. ఏదైనా ముందుగా గుర్తించాలి. తీవ్రతను బట్టి ప్రభుత్వ దవాఖానలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డులో చేరాల్సి ఉంటుంది.



-జలగం తిరుపతిరావు, వైస్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ మెడికల్ కళాశాల

**వైరల్ ఫీవర్ లక్షణాలు..**

వైరల్ ఫీవర్ వచ్చినప్పుడు వివిధ రకాల లక్షణాలు చూపుతాయి. ముఖ్యంగా జ్వరం, అలసట, వికారం, ఒళ్లు నొప్పులు, రాషెస్, తలనొప్పి, దగ్గు, గొంతు నొప్పి, ఉదరంలో నొప్పి మొదలగు లక్షణాలు ఉంటాయి.

**శరీరం మీద వైరల్ ఏ విధంగా ప్రభావం చూపుతుంది..**

శరీరంలోని కణాల మీద వైరస్ అటాక్ చేస్తుంది. చాలా వరకూ వైరల్‌ఫీవర్‌తో శరీరం పై భాగం ఎక్కువగా ప్రభావితం అవుతుంది. శ్వాస వ్యవస్థ మీద ప్రభావం చూపుతుంది. వైరస్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంటే నరాల మీద ప్రభావం చూపుతుంది. దీంతో అనారోగ్య సమస్యలను ఎదుర్కొవాల్సి వస్తుంది.

**వైరల్ ఫీవర్ తీవ్రంగా ఉన్నప్పుడు...**


వైరల్ ఫీవర్ అతి ప్రమాదకరం. పేషంట్ చాలా బలహీనంగా ఉన్నప్పుడు ఆహారాలు పూర్తిగా తీసుకోలేనప్పుడు, వెంటనే దవాఖానలో అడ్మిట్ చేయించాలి. యాంటిబయోటిక్స్‌తో నయం కానప్పుడు వెంటనే డాక్టర్‌ను సంప్రదించి, దవాఖానలో చేర్పించాలి.

**వైరల్ ఫీవర్ వచ్చిన వెంటనే ఏం చేయాలి..**

వైరల్‌ఫీవర్ ట్రీట్ చేయడానికి పేషంట్ ఎక్కువగా నీళ్లు తాగాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి. లైట్ ఫుడ్స్ తీసుకోవాలి. వైరల్ ఫీవర్ ఇన్‌ఫెక్షన్ చాలా త్వరగా వ్యాప్తి చెందుతుంది. కప్పులు, స్పూన్లు, ప్లేట్లను షేర్ చేసుకోకుండా జాగ్రత్త వహించాలి.

**మరోవైపు కరోనా భయాందోళనలు**

**జిల్లాలో** ఉష్ణోగ్రతల్లో చోటుచేసుకున్న మార్పులతో జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. వైరల్ ఫీవర్ విజృంభిస్తున్న నేపథ్యంలో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామగ్రామాన అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే డెంగ్యూ లార్వా సర్వే చేపట్టారు. వైరల్ ఫీవర్‌తో పిల్లలు, పెద్దలు బయటికి రాని పరిస్థితి ఏర్పడింది. చలి జ్వరాలతో దవాఖానల పాలవుతున్నారు. గ్రామాల్లోఆర్ఎంపీ, పీఎంపీల వద్ద చికిత్స చేయించుకుంటున్నారు. ఒక సీజన్ నుంచి మరో సీజన్‌లోకి ప్రవేశించే ముందు రకరకాల ఇన్‌ఫెక్షన్లు సులభంగా దాడి చేస్తాయి. చల్లగా ఉన్న వాతావరణం వైరస్‌ల పెరుగుదలకు అనుకూలంగా ఉంటుంది. అందువల్ల ఈ సీజన్‌లో వైరల్ ఇన్‌ఫెక్షన్లు, జ్వరాల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఈ సీజన్‌లో ప్రతి పది మందిలో ఒకరికి జలుబు, జ్వరంతో కూడిన వైరల్ ఇన్‌ఫెక్షన్లు కనిపిస్తుంటాయి.ఎక్కువ మందిని బాధించే వైరల్ ఇన్‌ఫెక్షన్లలో ఫ్లూ జ్వరం కూడా ఒకటి. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు రక్తనాళాలు కుచించుకుపోతాయి. దీని వల్ల రక్త సరఫరా నెమ్మదిస్తుంది. రక్తంలో ఉండే తెల్లరక్త కణాల సంఖ్య క్రమంగా తగ్గడం వల్ల శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. ఈ ఇన్‌ఫెక్షన్లు, జ్వరాలు, పిల్లల్లో చాలా త్వరగా వ్యాప్తి చెందుతాయి. ఎక్కువ మంది గుమిగూడి ఉండే ప్రదేశాల్లో వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. అందుకే జ్వరాలు పిల్లల్లో చాలా త్వరగా వ్యాప్తి చెందుతాయి. రద్దీగా ఉన్న ప్రాంతాలకు వెళ్లి వచ్చిన వారు కూడా ఫ్లూ జ్వరం బారిన పడే అవకాశం ఉంటుంది.



నిజామాబాద్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులు (ఫైల్)

**ఓ వైపు వైరల్ ఫీవర్.. మరోవైపు కరోనా..**

జిల్లాలో వైరల్ ఫీవర్ బారిన పడినవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. వాతావరణంలో మార్పులతో రోగాలబారిన పడుతున్న వారికి మరోవైపు కరోనా భయం వెంటాడుతున్నది. ఇప్పటికే దేశంలో కరోనా కేసులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలోనూ కరోనా కేసులు వెలుగుచూడడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వైరల్ ఫీవర్, కరోనా బారిన పడితే దాదాపుగా ఒకే రకమైన లక్షణాలు కొన్ని ఉండడంతో దవాఖానలో పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అవసరమైతే ర్యాపిడ్ టెస్టులు చేయించుకోవాలని, భయపడాల్సిన అవసరం లేదని, వైద్యులను సంప్రదించి మందులు వాడితే సరిపోతుందని చెబుతున్నారు.

## కోటగిరిలో ఒకరికి డెంగ్యూ

కోటగిరి, జూన్ 24: కోటగిరిలో ఒకరికి డెంగ్యూ ప్రబలిందని వైద్య సిబ్బంది మంగళవారం తెలిపారు. సూపర్‌వైజర్ సునీత తెలిపిన ప్రకారం.. కోటగిరి పోలీస్‌స్టేషన్ వెనుక నివసించే ఓ యువతికి తీవ్ర జ్వరం రావడంతో సోమవారం కోటగిరి సర్కారు దవాఖానలో రక్త పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. ఆమెకు డెంగ్యూ పాజిటివ్ అని నిర్ధారణ అయ్యిందని, దీంతో మెరుగైన చికిత్స నిమిత్తం బోధన్ సర్కారు దవాఖానకు తరలించినట్లు తెలిపారు. బాధితురాలి ఇంటి పరిసరాలు, కాలనీలో శానిటైజేషన్ పనులు చేయించినట్లు చెప్పారు.





**సర్వర్ డౌన్.. నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు**

**లింగంపేట, నాగిరెడ్డిపేట మండలాల్లో** రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో తీవ్ర జాప్యం నెలకొంటున్నది. ఆన్‌లైన్ సేవల్లో అంతరాయం కలుగడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో తమ భూముల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన రైతులు తహసీల్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. సర్వర్‌పై భారం కారణంగా ఆన్‌లైన్ సేవల్లో అంతరాయం ఏర్పడుతుండడంతో మంగళవారం నాగిరెడ్డిపేటలో 12 రిజిస్ట్రేషన్లు కాగా..లింగంపేటలో కేవలం మూడు రిజిస్ట్రేషన్లు మాత్రమే చేసినట్లు తహసీల్దార్ సురేశ్ తెలిపారు.

-వివరాలు 6లో..

# యాదవులను అణచివేస్తున్న ప్రభుత్వం

- కాంగ్రెస్ సర్కార్‌కు గుణపాఠం చెబుదాం
- 30న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా
- రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షుడు రాజారాం యాదవ్

ఖలీల్‌వాడి, జూన్ 24 : కాంగ్రెస్ ప్రభుత్వం యాదవులపై వివక్ష చూపుతూ అణచివేస్తున్నదని రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షుడు రాజారాం యాదవ్ ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి యాదవులు, మున్నూరుకాపులు, ఇతర కులాలను అణచి వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. యాదవ కులాన్ని అవమానపర్చేలా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ సర్కార్‌కు గుణపాఠం చెబుదామని పిలుపునిచ్చారు. అత్యధిక జనాభా ఉన్న యాదవులను రేవంత్‌రెడ్డి కించపరుస్తూ మంత్రివర్గంలో స్థానం కూడా కల్పించలేదన్నారు. కనీసం ఎమ్మెల్సీ, నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించకపోవడం యాదవులను అవమానించడమేనని పేర్కొన్నారు. బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. అనంతరం ఈ నెల 30న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, జిల్లా కన్వీనర్ బాపురావు యాదవ్, యాదవ సంఘం ప్రతినిధులు రాజన్న యాదవ్, జనార్దన్ యాదవ్, లింగన్న యాదవ్ పాల్గొన్నారు.

# ‘గృహలక్ష్మి’ డబ్బులు మాయం!

- ఇంతవరకు బిల్లులు చెల్లించలేదు..
- మా డబ్బులు మాకు ఇప్పించండి
- బిచ్కుంద ఎంపీడీవో ఆఫీస్ ఎదుట లబ్ధిదారుల నిరసన

బిచ్కుంద, జూన్ 24: గత ప్రభుత్వ హయాంలో గృహలక్ష్మి పథకం కింద మంజూరైన బిల్లులు తమకు రాలేదంటూ గోపన్‌పల్లి గ్రామస్తులు మంగళవారం ఎంపీడీవో ఆఫీస్ ఎదుట నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. 2023లో గృహలక్ష్మి పథకం కింద పది మందికి ఇంటి నిర్మాణం కోసం ఒక్కొక్కరికీ రూ.3 లక్షల చొప్పున మంజూరైనట్లు తెలిపారు. వాటికి సంబంధించిన బిల్లులు ఇప్పటి వరకు ఒక్కరూపాయి కూడా తమకు అందలేదని వాపోయారు. అధికారులకు అడిగితే తమకు తెలియదని సమాధానం ఇస్తున్నారని, తమ పేర్లమీద మంజూరైన డబ్బులు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. తమకు మంజూరైన డబ్బులను తమకు ఇప్పించాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. గృహలక్ష్మి బిల్లుల మంజూరుపై ఎంపీడీవో గోపాలకృష్ణను వివరణ కోరగా ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బిచ్కుంద ఎంపీడీవో గోపాలకృష్ణకు వినతిపత్రం అందచేస్తున్న లబ్ధిదారులు

**మా బిల్లులు ఎవరు తీసుకున్నరో చెప్పాలి**



గత ప్రభుత్వ హయాంలో గృహలక్ష్మి పథకం కింది ఇల్లు మంజూరైంది. డబ్బు లు ఇస్తారని చెబితే ఇల్లు కట్టుకున్నం. కానీ ఇప్పటి వరకు డబ్బులు రాలేదు. ఆన్‌లైన్‌లో చూస్తే మా పేరు మీద మంజూరైన బిల్లులు ఎవరో తీసుకున్నట్లు చూపుతున్నది. మా పేరు మీద బిల్లులు ఎవరు తీసుకున్నరో మాకు చెప్పాలి.మా బిల్లులు మాకు ఇప్పించాలని కోరుతున్నం.

-నిరుడి నాగమణి, గోపన్‌పల్లి గ్రామం

**అధికారులను అడిగితే తెల్వదంటున్నరు**



గృహలక్ష్మి పథకం కింద మాకు మూడు లక్షల రూపాయలు మంజూరయ్యాయి. మాకు ఇప్పటి వరకు ఒక్కరూపాయి కూడా ఎవరూ ఇవ్వలేదు. ఎంపీడీవో కార్యాలయంలో అధికారులను అడిగితే మాకు తెలియదని సమాధానం ఇస్తున్నరు. మా పేరు మీద మంజూరైన బిల్లులు ఎవరు తీసుకున్నారో తెలుసుకొని, మా బిల్లులు మాకు ఇప్పించి మాకు న్యాయం చేయాలని విన్నవిస్తున్నాం.

-నాయిని నరేశ్, గోపన్‌పల్లి గ్రామం

# బాలికను మందలించాడని.. ఉపాధ్యాయుడిని చితకబాదిన తండ్రి

**కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఘటన**

కామారెడ్డి, జూన్ 24 : బాలికను మందలించాడని ఉపాధ్యాయుడిని తండ్రి చితకబాదాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని హనుమాన్ మందిర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం చోటుచేసుకున్నది. బాధిత టీచర్ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 21న పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న వైష్ణవి అనే బాలిక మరో బాలిక మైథిలితో కలిసి ఓ ఉపాధ్యాయుడి అనుమతితో బాత్‌రూంనకు వెళ్లారు. చాలా సేపటితర్వాత తిరిగిరావడంతో ఉపాధ్యాయుడు బాలకృష్ణ వారిని ప్రశ్నించా డు. వైష్ణవితో అలా బయటికి వెళ్లవద్దని, మీ తల్లిదండ్రులు చూస్తే ఎలా ఉంటుందని మైథిలిని మందలించాడు. దీంతో మైథిలి తనను బాలకృష్ణ అనే ఉపాధ్యాయుడు బయటికి వెళ్లనీయడంలేదని, ఎవరితో ఉండొద్దని చెప్పాడని తన తండ్రి వద్ద సాయికృష్ణకు చెప్పింది. మంగళవారం ఉదయం మైథిలి తండ్రి సాయికృష్ణ పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడు బాలకృష్ణను దుర్భాషలాడుతూ చితకబాదాడు. టీచర్‌ను చితకబాదుతుండగా సాయికృష్ణ స్నేహితుడు వీడియో తీశాడు. దీంతో సాయికృష్ణతోపాటు అతడి స్నేహితుడిపై కామారెడ్డి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఉపాధ్యాయుడు బాలకృష్ణ తెలిపాడు. సాయికృష్ణపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయుడిపై దాడిని పీఆర్టీయూ, ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘాలు ఖండించాయి.